ప్రజాశక్తి

మంగళవారం 18 ఫిబ్రవరి 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



దీప్లానగర్ సమీపాన బర్డ్ ఫ్లూతో మరణించిన కోళ్లు

బర్డ్ ఫ్లూ మరింత వ్యాప్తి

- ఎ.కొండూరు ప్రాంతంలో 1500 కోళ్లు మృతి
- కోళ్ల ఫారాన్ని సందర్శించిన పశు సంవర్ధక శాఖ అధికారులు



మరణించిన కోళ్లను బస్తాల్లో మూటలు కడుతున్న దృశ్యం

ప్రజాశక్తి - ఏ కొండూరు : ఎన్‌టిఆర్ జిల్లా ఏ కొండూరు మండలం కష్ణారావు పాలెం పంచాయతీ దీప్లానగర్‌లోని కోళ్ల ఫారంలో గత మూడు రోజులుగా కోళ్లు మతి చెందుతున్నాయి. ఇప్పటికే ఈ ఫారంలో 1500 వరకు కోళ్లు మత్యువాతపడ్డాయి. కోళ్ల ఫారం యజమాని మతి చెందిన కోళ్లను గొయ్యి తీసి పూడ్చిపెడుతున్నట్లు తెలిసింది. ఇప్పటివరకు ప్రసార, ప్రచార మాధ్యమాల ద్వారా కోళ్లకు బార్డ్ ఫ్లూ సోకిందని, కోడి మాంసం తినవద్దని విన్న ప్రజానీకం తాము నివసించే ప్రాంతంలోనే ఈ వ్యాధి ప్రబలిందని తెలిసి భయభ్రాంతులకు గురయ్యారు. గత మూడు రోజులుగా బార్డ్ ఫ్లూ వల్ల కోళ్లు మతి చెందుతున్నా వ్యాధిని నిర్ధారించి ప్రజలను అప్రమత్తం చేయాల్సిన పశు వైద్యాధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆ ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు. కోళ్లన్నీ మరణించిన తర్వాత సోమవారం వైద్యాధికారులు వచ్చారని స్థానికులు చెబుతున్నారు. తనకు సుమారు రూ.6 లక్షల వరకు నష్టం వాటిల్లిందని కోళ్ల ఫారం యజమాని వాపోతున్నారు. తాము అప్పుల ఊబిలో కూరుకుపోయినట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. పశు

(మిగతా 2లో)

స్కూల్ కాంప్లెక్స్ పోయే... క్లస్టర్ వచ్చే...

- పాఠశాల విద్యా వ్యవస్థలో పలు మార్పులు
- ఉపాధ్యాయులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి



ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ప్రభుత్వాలు విద్యా వ్యవస్థలో తీసుకు వస్తున్న మార్పులు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా పాఠశాల విద్యావ్యవస్థలో ప్రభుత్వం తీసుకు వచ్చిన పలు మార్పులు ఉపాధ్యాయులపై పని ఒత్తిడిని పెంచుతోంది. మరోపక్క ఈ మార్పులు వారిని గందరగోళానికి గురిచేస్తున్నాయి. తాజాగా స్కూల్ కాంప్లెక్స్‌లను కుదిస్తూ వాటి స్థానంలో క్లస్టర్‌లను తీసుకు రావడంలోని పొరపాట్లపై ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర చర్చ సాగుతోంది.

రెండు జిల్లాల్లో కుదింపు ఇలా

పాఠ్యాంశాలను మెరుగైన పద్ధతుల్లో ఉపాధ్యాయులు బోధించడానికి అవసరమైన అవగాహన, విద్యార్థుల నైపుణ్య స్థాయిలను తెలుసుకోవడానికి ప్రభుత్వాలు స్కూల్ కాంప్లెక్స్‌లు తీసుకు వచ్చాయి. తాజాగా దీన్ని కుదిస్తూ ప్రభుత్వం క్లస్టర్లను రూపొందించింది. కృష్ణాజిల్లాలో 145 స్కూల్ కాంప్లెక్స్‌లను 97 క్లస్టర్‌లుగా, ఎన్‌టిఆర్ జిల్లాలోని 106 స్కూల్ కాంప్లెక్స్‌లను 69 క్లస్టర్‌లుగా కుదించింది. విద్యాశాఖ మండల అధికారి (ఎంఇఒ) పర్యవేక్షణలో గతంలో స్కూల్ కాంప్లెక్స్‌ల్లో నెలలో ఒకరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రోజంతా ఉపాధ్యాయుల సమావేశాలు జరిగేవి. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు పాఠ్యాంశాల్లోని క్లిష్టమైన అంశాలను సులభంగా విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలను రూపొందించి బోధనా పద్ధతిని విశదీకరించేవారు. ఆ కాంప్లెక్స్ పరిధిలోని విద్యార్థులు కాంప్లెక్స్‌లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధనలు వినే అవకాశం కల్పించేవారు. బోధన అనంతరం మిగిలిన ఉపాధ్యాయుల స్పందన తీసుకుని లోపాలను సరిచేసుకునే అవకాశం కల్పించేవారు.

క్లస్టర్ మార్పులతో ఉపాధ్యాయులపై పని ఒత్తిడి

తాజాగా తీసుకు వచ్చిన క్లస్టర్ సమావేశాలను ప్రతి మూడో శనివారం నిర్వహిస్తున్నారు. స్కూల్ క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయుల పర్యవేక్షణలోనే సాగుతోంది. మధ్యాహ్నం 12.30 గంటలకు భోజనం ముగించి విద్యార్థులను ఇంటికి పంపిన తర్వాత ఉపాధ్యాయులు ఒంటి గంటకు క్లస్టర్ల సమావేశానికి హాజరు కావాలి. గతంలో గ్రామీణ ప్రాంతాలకు సగటున ఐదు కిలోమీటర్లలోపు ఉండే కాంప్లెక్స్‌ల సంఖ్య తగ్గిపోవడంతో మారుమూల గ్రామాల్లోని ఉపాధ్యాయులు క్లస్టర్‌లకు చేరడానికి 15 కిలోమీటర్లకుపైగా ప్రయాణించాల్సి వస్తోంది. మారుమూల గ్రామాల్లో స్వంత వాహనాలు లేని మహిళా, దివ్యాంగ ఉపాధ్యాయులు క్లస్టర్‌లకు చేరుకోవడం సమస్యాత్మకంగా మారింది. ఈ నేపథ్యంలో క్లస్టర్లకు చేరుకోవడం ఆలస్యమైన ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరికలు జారీ చేయడం ఆందోళన కలిగిస్తోంది. దీనికితోడు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ఫ్యానల్ (ఐఎఫ్‌పి)లో ఉపాధ్యాయులకు వీడియోలను చూపి శిక్షణ ముగిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నెట్ సర్వీస్ అందుబాటులోకి రాకపోవడంతో ఐఎఫ్‌పి ప్యానల్స్ పనిచేయడం లేదు. అనుభవజ్ఞుల ప్రత్యక్ష బోధన లేకపోవడంతో ఉపాధ్యాయుల పనితీరుపై సమీక్ష కొరవడింది. హైస్కూల్ సబ్జెక్టు టీచర్లకు ఒక్కో కాంప్లెక్స్‌లో 40 మందికి శిక్షణ అందించే వారు. క్లస్టర్‌లో పది మందిలోపు సబ్జెక్టు టీచర్లను ఒక గ్రూపుగా చేర్చారు. క్లస్టర్లలో వివిధ రిపోర్టులు స్వల్ప వ్యవధిలో పూర్తి చేయాలని చెప్పడంతో ఉపాధ్యాయులపై పనిఒత్తిడి పెరిగిపోతోంది. ఈసమస్యలను ప్రభుత్వం సకాలంలో పరిష్కరించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

మండలిలో పిడిఎఫ్ నిర్మాణాత్మక పాత్ర



మచిలీపట్నంలో ప్రచారం చేస్తున్న కె.ఎస్.లక్ష్మణరావు

- ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు
- మచిలీపట్నంలో విస్తృత ప్రచారం



ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : శాసన మండలిలో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ, ప్రజా సమస్యలపై గొంతెత్తి పోరాడేది పిడిఎఫ్ ప్రజాప్రతినిధులేనని ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు స్పష్టం చేశారు. ఈనెల 27న జరిగే ఉమ్మడి కృష్ణా – గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీచేస్తున్న లక్ష్మణరావు సోమవారం కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నం నగరంలో విస్తతంగా ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులను, ఉపాధ్యాయులను, గ్రాడ్యుయేట్ అభ్యర్థులను కలిసి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పలు విద్యాసంస్థల్లో ప్రచారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, కష్ణా యూనివర్సిటీ, ఎల్‌ఐసి, రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, పవిత్ర జూనియర్ కాలేజ్ ఆర్కే జూనియర్ కాలేజ్, చైతన్య, స్టార్ కళాశాల,సెయింట్ ఫ్రాన్సిస్ నిర్మల హైస్కూల్లో విస్తతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ 12 సంవత్సరాలగా ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక సమస్యలను శాసన మండలిలో ప్రస్తావిస్తు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిర్మాణాత్మకమైన పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. 50 ప్రజా సంఘాల మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తెలిపారు. సిపిఎస్‌ను వ్యతిరేకిస్తూ ఎన్నో ఏళ్లుగా అనేక ఉద్యమాలు చేశామని గుర్తుచేశారు. సిపిఎస్‌తో పాటు జిపిఎస్, అలాగే కేంద్రం ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన యుపిఎస్‌కి కూడా తాము వ్యతిరేకమన్నారు. పాత పెన్షన్ స్కీమ్‌కే తాము అనుకూలమని స్పష్టం చేశారు. అలాగే నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ అని, డీఎస్సీ పోస్టుల భర్తీ అన్నారని, కానీ ఎప్పుడు భర్తీ చేస్తారో స్పష్టంగా చెప్పలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని విమర్శించారు. అలాగే నిరుద్యోగ భృతి వంటి ఏ పథకాలను ప్రభుత్వం అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రజాసంఘాల నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, బి సుబ్రహ్మణ్యం టి.చంద్రపాల్ ,సిహెచ్ రాజేష్, కె.శర్మ, సిహెచ్ జయరావు, బెనర్జీ, కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ స్పందన

లక్ష్మణరావు ఎన్నికల ప్రచారంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల నుంచి అపూర్వ స్పందన లభించింది. ప్రతి చోటా లక్ష్మణరావుకు ఎదురొచ్చి స్వాగతం చెప్పారు. తమ సమస్యలపై అవగాహన ఉన్నవారు శాసనమండలిలో ఉండాలంటూ ఓటర్ల నుండి స్పందన వచ్చింది.



కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశకు వినతిపత్రం సమర్పిస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు జి.ఆంజనేయులు, ఎస్.వెంకట్రావు, వీర్ల శ్రీరామ్ యాదవ్, యేమినేని వెంకట రమణ, కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్ తదితరులు

జర్నలిస్టులపై దాడుల నివారణకు కమిటీ

- ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు
- ప్రజాశక్తి విలేకరిపై దాడిని ఖండిస్తూ ఎన్‌టిఆర్ కలెక్టర్‌కు జర్నలిస్టుల వినతి

ప్రజాశక్తి - విజయవాడ : జర్నలిస్టులపై దాడుల నివారణకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి మాల్యాడ రామారావుపై ఆ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ నాయుడు చేసిన దాడిని నిరసిస్తూ సోమవారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశకు వివిధ జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యాన వినతిపత్రం సమర్పించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స్

(మిగతా 2లో)



పార్కును పరిశీలిస్తున్న విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

నాగేశ్వరావు పార్క్ అభివృద్ధికి చర్యలు

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : 10వ డివిజన్ పటమటలో అభివృద్ధి చేస్తున్న డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు పార్కును త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం పటమట పంట కాలువ రోడ్, బెంజ్ సర్కిల్, ఈనాడు ప్రాంతాల్లో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పటమటలో దాదాపు 50 సెంట్ల విస్తీర్ణంలో నూతనంగా అభివృద్ధి చేస్తున్న డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు పార్కును అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానెట్ జివిజిఎస్‌వి ప్రసాద్, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరిండెంటింగ్ ఇంజినీర్ (ప్రాజెక్ట్) పి సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి వద్ద మృతురాలి బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వైద్యుల నిర్లక్ష్యం కారణంగా యువతి చనిపోయిందని ఆరోపిస్తూ సోమవారం నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆ యువతి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. వైద్యులు సకాలంలో వైద్యం చేయకపోవడం వల్లనే చనిపోయిందని కొద్దిసేపు ఆందోళన చేశారు. అనారోగ్యం కారణంగా జి.కొండూరుకు చెందిన సునీత (30) అనే యువతిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు చికిత్స చేస్తున్న సమయంలోనే యువతి కోమాలోకి వెళ్లింది. వైద్యులు చికిత్స చేసినా సహకరించలేదు. కొద్దిసేపటటికి ఆ యువతి చనిపోయింది. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి వైద్యులతో మాట్లాడించారు. ఏమి జరిగిందో వివరించారు.

వచ్చిన కొద్దిసేపటికే మృతి : సూపరింటెండెంట్

యువతిని తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రికి తీసుకొచ్చారని, రాగానే వైద్య సిబ్బంది చికిత్స ప్రారంభించారని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ తెలిపారు. చికిత్స అందించేలోగానే ఆమె మరణించిందని తెలిపారు. కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్న దానిలో వాస్తవంలేదన్నారు.

మొదటిపేజీ తరువాయి

జర్నలిస్టులపై దాడుల నివారణకు కమిటీ

అసోసియేషన్ (ఎపిబిజెఎ), ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఎపిఎంపిఎ) ఆధ్వర్యాన విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా జర్నలిస్టులపై దాడులు నిత్యకృత్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. మీడియా స్వేచ్ఛను కాపాడాలంటే ప్రభుత్వాలు ఇటువంటి దాడులు అరికట్టాలన్నారు. జర్నలిస్టులపై దాడుల నివారణకు కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎపిఎంపిఎ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులు సరికాదన్నారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ జర్నలిస్టు రామారావుపై దాడి చేసిన టిడిపి నేతపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంపిఎ రాష్ట్ర కార్యదర్శి యేమినేని వెంకట రమణ, ఎపిడబ్ల్యుజెఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్, ఎపిఎంపిఎ నాయకులు ప్రశాంత్ కుమార్, ఫెడరేషన్ జిల్లా నాయకులు వి.హరి నారాయణరాజు, చొప్పా రాఘవేంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూ మరింత వ్యాప్తి

సంవర్ధక శాఖ ఏడి డాక్టర్ రామారావు, కంభంపాడు అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ భరత్ సోమవారం ఆ కోళ్ల ఫారాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఎడి డాక్టర్ రామారావు మాట్లాడుతూ మరణించిన, బతికి ఉన్న కోళ్ల రక్త నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పెంచుకుంటున్న నాటు కోళ్లు కూడా మత్యువాత పడుతున్నట్లు తెలిసింది.

బర్డ్‌ఫ్లూ బఫర్ జోన్లో నిరంతరం అప్రమత్తం

జిల్లా సమన్వయ కమిటీలో కలెక్టర్ లక్ష్మీశ ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : గంపలగూడెం మండలం అనుమల్లంకలో కోళ్ల మరణాలకు సంబంధించి బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో పది కిలోమీటర్ల పరిధిలోని 35 గ్రామాల్లో తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్యలను కొనసాగించాలని, సమన్వయ శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. అనుమల్లంక ఘటన నేపథ్యంలో చేపడుతున్న నివారణ, నియంత్రణ చర్యలపై సమీక్షించేందుకు కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. బోఫాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైసెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ (నిహ్సాద్) నుంచి ఈనెల 14న వచ్చిన ఫలితాల్లో హెచ్5ఎన్1 ఏవియన్ ఇన్‌ఫ్లూయంజా వైరస్ పాజిటివ్ వచ్చినట్లు పశు సంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. అప్పటికే యుద్ధప్రాతిపదికన భద్రతా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన కేంద్రం (0-1 కిమీ)తో పాటు అనుమల్లంకకు పది కిలోమీటర్ల పరిధిలోని బఫర్ జోన్‌లో నియంత్రణ చర్యలను పకడ్బందీగా కొనసాగించాలన్నారు. బఫర్ జోన్‌లో చికెన్, గుడ్ల దుకాణాలను తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు మూసి ఉంచాలని స్పష్టం చేశారు. పారిశుధ్య కార్యక్రమాలను విస్తతంగా చేపట్టాలని, శానిటైజేషన్‌కు స్ప్రేయర్లు, ఫాగర్లను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బందితోపాటు పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలోని 116 కోళ్ల ఫారాల్లోనూ 24/7 నిరంతర పర్యవేక్షణతోపాటు బయో సెక్యూరిటీ చర్యలను చేపట్టాలన్నారు. ప్రతి చర్యలోనూ నిర్దిష్ట స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను అనుసరించాలన్నారు. బర్డ్‌ఫ్లూపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా బఫర్ జోన్‌లో ఫీవర్ సర్వేలను నిర్వహించాలని ఆదేశించారు. ఈసమావేశంలో జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీపీవో పి.లావణ్య కుమారి, ఫారెస్ట్ రేంజ్ అధికారి పి.రాజు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణ

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఉమ్మడి కష్ణా-గుంటూరు జిల్లాల శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలను నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. ఎమ్మెల్సీ ఎన్నికలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లా పరిధిలో ఓటర్లు, పోలింగ్‌స్టేషన్ లొకేషన్లు, ఆగ్జలరీ పోలింగ్ స్టేషన్లు తదితరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ జిల్లాలో 78,063 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 45,425 మంది కాగా మహిళలు 32,625 మంది, టీజీ ఓటర్లు 13 మంది ఉన్నట్లు వివరించారు. 11 అనుబంధ పోలింగ్ స్టేషన్లతో సహా మొత్తం 112 పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని వివరించారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని, మార్చి 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందన్నారు. అప్పటివరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లో ఉంటుందన్నారు. జిల్లావ్యాప్తంగా ఎంసీసీని పటిష్ఠంగా అమలు



సమావేశంలో మాట్లాడుతున్నకలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

చేస్తున్నామన్నారు. శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించే క్రమంలో కలెక్టరేట్‌లో 0866 -2575822 నంబరుతో కమాండ్ కంట్రోల్ రూం పనిచేస్తోందన్నారు. ఉల్లంఘనలపై ఈ నంబరుకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అభ్యర్థులు అనుమతుల మేరకు ఎన్నికల ప్రచారం చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఓటర్లకు ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, ఎంసీసీ నోడల్ అధికారి కె.శ్రీనివాసరావు, స్వీప్ నోడల్ అధికారి యు.శ్రీనివాసరావు, పి.ఏసుదాస్ (ఐఎన్‌సీ), డీవీ కష్ణ (సీపీఎం), వై.రామయ్య (టీడీపీ), కె.పరమేశ్వరరావు (ఏపీపీ), వై.ఆంజనేయరెడ్డి (వైఎస్ఆర్‌సీపీ), కె.తరుణ్ (బీజేపీ), కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ చంద్రమౌళి, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పశు సంవర్ధక శాఖ ఉద్యోగులను కొనసాగించాలి

డైరెక్టర్‌కు కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ వినతి

ప్రజాశక్తి-విజయవాడ : పశుసంవర్ధక శాఖలోని 1962 వాహన సేవలలో గత 3 సంవత్సరాలుగా ఏజన్సీ ద్వారా పనిచేస్తున్న ఉద్యోగులను కొనసాగించాలని సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఎ వెంకటేశ్వరరావు కోరారు. ఈమేరకు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ..పశు సంవర్ధక శాఖలో గత 3 సంవత్సరాలుగా మన రాష్ట్రంలో దాదాపు 1350 మంది పశు సంచార వైద్య వాహనాలలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ఇ.యం.ఆర్.ఐ. ఏజన్సీ ద్వారా పనిచేస్తున్నారన్నారు. సదరు సంస్థ కాలపరిమితి ఫిబ్రవరి 15తో ముగిసినట్లుగా యాజమాన్యం ఉద్యోగులకు లేఖలు పంపిందన్నారు. 1962 సేవల్లో ఉద్యోగులంతా అతి తక్కువ వేతనాలతో అనేక ఇబ్బందులకు ఓర్చి సేవలు అందిస్తున్నారన్నారు.మన రాష్ట్రంలో వివిధ శాఖల్లో వివిధ సేవలను సర్వీస్ ప్రొవైడర్‌ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ఏజన్సీలు మారినా, రాష్ట్ర ప్రభుత్వం అప్పటి వరకూ పనిచేసిన ఉద్యోగులనే నూతన సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా కొనసాగిస్తుందన్నారు.వైద్య, ఆరోగ్య శాఖలో 108 ఉద్యోగులను గత 18 సంవత్సరాలుగా, 104 ఉద్యోగులను గత 16 సంవత్సరాలుగా, తల్లీ, బిడ్డ ఎక్స్‌ప్రెస్ (102) ఉద్యోగులను గత 7 సంవత్సరాలుగా, 108 ఫీడర్ అంబులెన్స్ ఉద్యోగులను గత 8 సంవత్సరాలుగా కొనసాగిస్తున్నది. సర్వీస్ ప్రొవైడర్‌లను రాష్ట్ర ప్రభుత్వం మార్చినా ఉద్యోగులను నూతన ప్రొవైడర్ల ద్వారా కొనసాగిస్తున్నారన్నారు. పై అంశాలను మీరు పరిశీలించి ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులందర్నీ కొనసాగించేలా తగు చర్యలు చేపట్టాలని కోరారు. అంతేగాక ఖాళీల్లో మాత్రమే కొత్తవారిని నియమించాలని కోరుతున్నామన్నారు. నూతన ఎజన్సీతో చేసుకునే ఒప్పందంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన వేతనం రూ.21,500 చెల్లించేలా, చట్ట ప్రకారం పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ., ఇతర చట్టబద్ద సౌకర్యాలు కల్పించాలని కోరారు .నాయకులిచ్చిన వినతిపత్రంపై డైరెక్టర్ దామోదర్‌నాయుడు స్పందిస్తూ...గత మూడు సంవత్సరాల నుంచి 1962లో పని ఎవరైతే పనిచేస్తున్నారో వారిని తిరిగి కొనసాగించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు టీ రత్నరాజు, 19 62 వాహనాల్లో పనిచేసే డాక్టర్లు, పైలెట్లు, సంఘం నాయకులు ఈ.అమత, పి.శిరీష, ఎస్.వీరబాబు, బి.నరేష్ నాయక్, కె.జయంత్, ఎస్.కె. మౌలాలి, ఎం.వి శ్రీధర్ పాల్గొన్నారు.



పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్‌కు వినతిపత్రం అందిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 3
మంగళవారం 18 ఫిబ్రవరి 2025


గుడివాడలో...


కంకిపాడులో...

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ధర్నా

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: అంగన్వాడీలకు వేతనాలు పెంచి, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జిఒ ఇవ్వాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మచిలీపట్నంలోని సిడిపిఒ కార్యాలయం వద్ద సోమవారం మచిలీపట్నం ప్రాజెక్టు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్లు అనేక సేవలు అందిస్తున్నారన్నారు. అంగన్వాడీ సెంటర్ల నిర్వహణకు రకరకాల పెట్టుబడులు పెట్టి సెంటర్లు నిర్వహిస్తున్నా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదన్నారు. అంగన్వాడీలకు వేతనాల పెంపు తదితర సమస్యల పరిష్కారం కోసం 42 రోజుల పాటు చారిత్రాత్మక సమ్మె నిర్వహించామన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్లెన్స్ రూపొందించి అమలు చేయాలని, సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు వర్తింపజేయాలని, సర్వీసులో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కార ఖర్చులకు 20 వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, మెనూ ఛార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సిడిపిఒ గ్లోరీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం ప్రాజెక్టు అధ్యక్షురాలు సిహెచ్ నాంచారమ్మ, కార్యదర్శి పి రెజీనా రాణి, సెక్టార్ లీడర్స్ లక్ష్మి, శ్రీలక్ష్మి, సౌజన్య, అంజలీదేవి, విజయశ్రీ, రత్నమాణిక్యం, సీతారత్నం, సుజాత పాల్గొన్నారు.

చల్లపల్లి (మొవ్వ): మొవ్వ ప్రాజెక్ట్ కేంద్రం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సిడిపిఒ డి.సుధారాణికి అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ విజయలక్ష్మి, డి రాజారత్నం, చల్లపల్లి గంగాభవాని, వేమూరి లక్ష్మి, తాత శివకుమారి, అమలేశ్వరమ్మ, గురుముచ్చు పద్మజ, చంద్ర సునీత, భలే పద్మ, నాగమల్లేశ్వరి, సత్యవాణి, శేషు కుమారి, కృష్ణకుమారి, జ్యోతి, వెంకటేశ్వరమ్మ, కమల, తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: కంకిపాడు సిడిపిఒ ఆఫీస్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ అంగన్వాడీవర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్లు,కు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని, వారికిచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంకిపాడు ప్రాజెక్ట్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నళినికుమారి, రేవతి, సెక్టార్ లీడర్లు రమాదేవి, మీరాభి, కాళేశ్వరీదేవి, హాలీమబీ, విజయలక్ష్మి. కనకరత్నం, చంద్రలీల, సిఐటియు కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు మండలాల కార్యదర్శులు నరేష్, త్రిమూర్తులు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. నాలుగు మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ధర్నాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఏరియా యూనియన్ నాయకులు నిర్మల, జ్యోతి, గాదె సుశీల, ఎ.నాగమణి, కాశీ హంస తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ: అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు కనీస వేతనం అమలు చేయాలని కోరుతున్నప్పటికి వాటిని ఏ ప్రభుత్వం వచ్చినా పట్టించుకోవడం లేదని అంగన్‌వాడీల ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శిలు వై.గీత, టి.వాణిలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక శిశు సంక్షేమ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలకు వేతనాలు, గ్రాట్యుటి, మీని సెంటర్‌లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జివో విడుదల చేయాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం 11 సంవత్సరాల పాలనలో అంగనవాడి వర్కర్స్‌కి ఎలాంటి జీతభత్యాలు పెంచలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ పోరాటాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై నరసింహారావు, ఆర్‌సిపి రెడ్డి, నాయకులు బివి శ్రీనివాసరావులు తమ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు అమ్మాజీ, రమాదేవి, నిర్మలజ్యోతి, మేరీకుమారి, సుగుణ, వెంకటేశ్వరమ్మ, విజయలక్ష్మి, త్రివేణి, గుడివాడ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

పామర్రు: సిడిపిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు కే ఉమారాణి, కార్యదర్శి ఎం.సువర్ణలత, చిన్ని, అరుణ, వాణి, సిఐటియు నాయకులు ఓ గంగాధర్ ప్రసాద్, ఎం.విల్సన్, కె.నాగభూషణం పాల్గొన్నారు.


మొవ్వలో...


పామర్రులో...


బందరులో...

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-ఘంటసాల: అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఘంటసాల మండల పరిధిలోని ఘంటసాల పాలెం శివారు చాట్రగడ్డ వాని దళితవాడ పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయుడు కే.సాల్మన్ రాజు నివసిస్తున్న పూరిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో ఆయన ఇంట్లో లేరు. మంటలను స్థానికులు ఆర్పి వేశారు. పూరిల్లు ఎలా దగ్ధమైందన్న విషయంపై ఘంటసాల పోలీస్ సల్మాన్ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు.



ఐలూరు పుష్కర ఘాట్ పూడ్చివేత

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: దక్షిణ కాశీగా వెలుగొందుతున్న మండలంలోని ఐలూరు గ్రామంలో శ్రీ రఘునాయక రామేశ్వరస్వామి దేవాలయం ఉంది. పురాణాల నుంచి ఈ ప్రాంతానికి ఎంతో ప్రసిద్ధి ఉంది. పుష్కరాల సమయంలో, మహాశివరాత్రి పర్వదినాలలో లక్షలాదిమంది యాత్రికులు ఐలూరు గ్రామానికి వచ్చి కృష్ణా నది పాయల్లో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. అందువల్ల యాత్రికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని రివర్ కన్జర్వెన్సీ అధికారులు లక్షల రూపాయలు హెచ్చించి రెండు పుష్కర స్నాన ఘాట్లు ఏర్పాటు చేశారు. దీంతో లక్షలాది మంది భక్తులు ఈ పుష్కర ఘాట్ లో నుంచి దిగి పుణ్యస్నానాలు ఆచరించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా గమ్యానికి చేరుకునేవారు. ఈనెల 26వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా లక్షల మంది భక్తులు ఐలూరు గ్రామానికి చేరుకుంటారు. ఈ తరుణంలో కృష్ణానది పాయ ఒడ్డున నిర్మించిన రెండు పుష్కర ఘాట్లలో ఒక ఘాట్ పూర్తిగా ఇసుక, బుసకతో పూడ్చి వేశారు. లక్షల రూపాయలతో నిర్మించిన ఘాట్ను పూడ్చి వేయడంపై పలువురు ఆవేదన చెందుతున్నారు.



70 మందికి దంత పరీక్షలు

ప్రజాశక్తి-పమిడిముక్కల: ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతిఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ సుధాకర్ అన్నారు. సోమవారం ముళ్ళపూడిలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. పిన్నమనేని హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో 70 మందికి పైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముళ్ళపూడి గ్రామ కార్యదర్శి కృష్ణకుమారి, గ్రామ పెద్దలు నాగేశ్వరావు, వెంకటేశ్వరరావు, సుజాత, పాల్గొన్నారు.



ఆర్‌టిసి ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-ఉయ్యూరు: కేంద్ర కార్యాలయం సర్క్యులర్‌కు వ్యతిరేకంగా జరిపిన చార్జ్ కౌన్సిలింగ్‌ను రద్దు చేసే వరకు ఉద్యమిస్తామని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జోనల్ ప్రెసిడెంట్ డీఎఆర్ రాజు, ఉయ్యూరు డిపో సెక్రటరీ పి మురళీకృష్ణ అన్నారు. ఉయ్యూరు ఆర్టీసీ డిపోలో కేంద్ర కార్యాలయం సర్క్యులర్కు విరుద్ధంగా నిర్వహించిన చార్జ్ కౌన్సిలింగ్ రద్దు చేసి తిరిగి కౌన్సిలింగ్ జరపాలని కోరుతూ ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో ఉద్యోగులు చేపట్టిన ఆందోళనలో భాగంగా సోమవారం నాల్గో రోజు రిలే దీక్షను రాజు ప్రారంభించారు. ఎస్ఎంసీ చైర్మన్ ఆరేపల్లి శివసాయి ప్రసాద్, కమిటీ సభ్యుడు ఎం చింత య్య దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఎస్ సారధి, సీహెచ్ పిచ్చయ్య దీక్షలో పాల్గొనగా ఎన్ఎంయూఏ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాసరావు, కెఎస్ రావు ఇతర ఉద్యోగులు పాల్గొని నిరసన తెలిపారు. ఆందోళనలో భాగంగా కొద్ది సేపు డిపో గేటు ఎదుల ధర్నా చేసి నిబంధనలకు విరుద్ధంగా జరిపిన చార్జ్ కౌన్సిలింగ్కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉంది
పులిగడ్డ సర్పంచ్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి-అవనిగడ్డ: మదర్ థెరిసా విశిష్ట సేవ జాతీయ పురస్కారం అందుకోవడం గర్వంగా ఉందని పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ ఆనందం వ్యక్తం చేశారు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం హైదరాబాదులోని సారస్వత పరిషత్ విశ్వాత్ ఆధ్వర్యంలో భారతీయ కళావైభవం 2025 రాష్ట్రాల ఎంబీసీ గౌరవాధ్యక్షులు ఆల్ ఇండియా నాని సేవాదళ్ చైర్మన్ డాక్టర్ నాని చేతుల మీదుగా మదర్ థెరిసా విశిష్ట సేవా జాతీయ పురస్కారం తీసుకోవడం జరిగిందన్నారు. విశ్వ ఆర్ట్స్ భారతీయ కళావైభవం వారికి డాక్టర్ ఆకుమల్ల నానికి ఈ సందర్భంగా కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు జడ్జి మధుసూదన్, డాక్టర్ వీర భోగ వసంతరాయలు, డాక్టర్ జెఎం రాజేంద్ర, లైన్స్ స్మార్ట్ నేత డాక్టర్ బిక్కు నాథ్, డాక్టర్ మాదాల నాగూర్ పాల్గొన్నారని తెలిపారు.



వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ వంతెన సెంటర్లో గల ప్రసన్నాంజనేయ స్వామి వారికి రూ.70 వేల విలువగల వెండి కిరీటాన్ని అవనిగడ్డకు చెందిన సింహాద్రి భావన్నారాయణ రాజ్యలక్ష్మి దంపతుల కుమారుడు సాహితీ చంద్రాలు బహూకరించారు. సోమవారం దాతలు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ కమిటీ వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బడే దానారావు, గంగు దేవరాజు, వడ్డీ రవీంద్ర పాల్గొన్నారు.

నేడు ఘంటసాలలో కిసాన్ మేళా

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాలలోని వ్యవసాయ పరిశోధనా స్థానంలో మంగళవారం కిసాన్ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.సత్యప్రియ లలిత, కషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డా.డి.సుధారాణి తెలిపారు. సోమవారం ఎఆర్ఎస్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వరి మాగాణుల్లో అపరాల సాగు - సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణ ప్రధాన అంశంతో ఈ మేళా జరుగుతుందన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ కిసాన్ మేళాలో క్షేత్ర సందర్శన, వ్యవసాయ ప్రదర్శన, రైతు సదస్సు, అతిధుల ప్రసంగాలు, శాస్త్రవేత్తల సాంకేతిక సందేశాలు, శాస్త్రవేత్తలు - రైతుల చర్చాగోష్టి, వ్యవసాయ క్విజ్ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కిసాన్ మేళాకు ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.ఆర్.శారద జయలక్ష్మిదేవి, కష్ణా జిల్లా కలెక్టర్ డి కె.బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డా.జి.శివనారాయణ, పరిశోధనా సంచాలకులు డా.వివి.సత్యనారాయణ, జిల్లా వ్యవసాయాధికారిణి ఎన్.పద్మావతి, సహపరిశోధనా సంచాలకులు డా.ఎన్.వి.వి.ఎస్.దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ కిసాన్ మేళాకు రైతులు విరివిగా పాల్గొని, వరి మాగాణుల్లో - అపరాల సాగుపై తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవికె, ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు వెంకటలక్ష్మి, పద్మావతి, లహరి, రేవతి, మంజువాణి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల జీతాలెప్పుడు ?

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ కార్మికుల వెతలు మళ్లీ మొదటి కొచ్చాయి. కొండపల్లి మున్సిపాలిటీ కార్మికులు జీతాలు లేక దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. జీతాలు సరైన సమయంలో అందక వీరి జీవనం దిన దిన గండం నూరేళ్ళ ఆయుష్షుగా మారింది. మున్సిపల్ కార్మికులు రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడిన జీతం అందుకోవడంలో తీవ్ర జాప్యానికి గురవుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల ఆరోగ్యాల కోసం తమ ఆరోగ్యాలను పణంగా పెట్టి నిత్యం వీధుల్లో చెత్తా చెదారాన్ని తొలగించే మున్సిపల్ కార్మికుల జీవనం దైన్యంగా మారింది. రాష్ట్రంలో ఏ మున్సిపాలిటీకి లేని దౌర్భాగ్య పరిస్థితి ఈ మున్సిపాలిటీలో ఏర్పడటానికి పాలకవర్గం లేకపోవడమే ప్రధాన కారణంగా కనబడుతుంది. కొండపల్లి మున్సిపాలిటీలో మొత్తం 183 మంది కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు పని చేస్తున్నారు. వీరికి రెండు నెలల నుండి జీతాలు రాక అప్పులు చేసి జీవనాన్ని కొనసాగిస్తున్నారు. జీతాలు ఇవ్వకపోతే ఏం తినాలి ఎలా బతకాలి కార్మికుల పస్తులు ఉండే పని చేయాలా తమ ఆకలి కేకలు పట్టవా అని కార్మికుల ప్రశ్నిస్తు న్నారు. ఎప్పుడో స్తాయా తెలియని జీతాల కోసం అప్పులు చేద్దామన్న అప్పులు పుట్టడం లేదని వాపోతున్నారు. ఆకలితో అలమటించలేక అధిక వడ్డీలకు అప్పులు తీసుకొని జీతాలు వచ్చినప్పుడు మొత్తం అప్పులకే కట్టవలసి వస్తుంది. కొండపల్లి మున్సిపాలిటీకి తరచుగా కమిషనర్లు మారుతూ ఉండడంతో కొత్తగా వచ్చినవారు జీతాలు చెల్లించేందుకు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితికి శాశ్వత పరిష్కారం అధికారులు, ప్రజా ప్రతినిధులు చూపించడం లేదు. అధికారులు మారినప్పుడల్లా జీతాలు రాక ఎప్పుడొస్తాయో తెలియక కార్మికులు మానసిక ఆవేదన గురవు తున్నారు. పెరుగుతున్న ధరలు, ఇఎంఐలు, ఇంటి అద్దెలు, కరెంట్ బిల్లులు, పిల్లల చదువులు ఇలా ప్రతీది అత్యవసరమైనప్పటికీ జీతాలు జాప్యం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి : సిఐటియు మండల కార్యదర్శి ఎం.మహేష్

కొండపల్లి మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు చెల్లించవలసిన జీతాలను వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని సిఐటియు మండల కార్యదర్శి ఎం మహేష్ డిమాండ్ చేశారు. అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి పారిశు ద్ధ్య కార్మికులకు జీతాలు సకాలంలో చెల్లించాలని కోరారు.

సాంకేతిక కారణాలతో జీతాలు ఆలస్యం : రమ్య కీర్తన, కొండపల్లి మున్సిపల్ కమిషనర్ :

సాంకేతిక కారణాల వల్ల జీతాలు ఆలస్యమయ్యాయని, పెండింగ్ జీతాలు మార్చి 1 వస్తాయని, ఇకనుండి ప్రతినెల 1 ఒకటో తారీఖున జీతాలు వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలం కె.తాడేపల్లిలోని సెయింట్ బెనిడిక్ట్ హైస్కూల్‌లో ఈ నెల 22న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం వరకు అయాన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అయాన్ ఐ హాస్పటల్ గౌరవ అధ్యక్షులు వావిలాల రజనీకాంత్ శర్మ తెలిపారు. ఈ శిబిరంలో అత్యున్నత వైద్య విద్యార్హతలు విశేష అనుభవం కలిగిన నిపుణులైన కంటి డాక్టర్లచే కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉచిత మందులు, ఐ డ్రాప్స్, కేటరాక్ట్ చేయవలసిన పేషంట్స్‌ని గుర్తించి వారికి తగు సాయం అందిస్తామని తెలిపారు. ప్రజలు ఈ శిబిరం సద్వినియోగించుకోవాలని తెలిపారు.

మాజీ సైనికుడు కృష్ణమూర్తి మృతి



ప్రజాశక్తి - నందిగామ : నందిగామ రైతుపేట 11వ వార్డులో మాజీ సైనికుడు పటితాల కృష్ణ మూర్తి (78) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె వున్నారు. మాజీ సైనికుల సంఘం వాసిరెడ్డి ప్రసాద్ నివాళులర్పించారు. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య సంతాపం తెలిపారు. పలువురు మాజీ సైనికులు నివాళులు అర్పించారు.

కూటమి అక్రమాలను ఖండించాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ తుని, పాలకొండ, పిడుగు రాళ్ళ మున్సిపాలిటీలతో పాటు రాష్ట్రంలోని అనేక చోట్ల టిడిపి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్ర మాలను, దౌర్జన్యాలను ప్రజాస్వామ్య వాదులు ప్రతీ ఒక్కరూ ఖండించాలని వైసిపి సీనియర్ నేత, జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్మెన్ షేక్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. తునిలో వైసిపికి పూర్తి మెజారిటీ ఉన్నప్పటికీ వైసిపి కౌన్సిలర్లని భయబ్రాంతులకు గురిచేసి తమ వైపులాక్కుని తుని



మున్సిపల్ పగ్గాలను చేపట్టే ప్రయత్నం చేయడం దుర్మార్గం అని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని గౌస్ మొహిద్దీన్ సోమవారం విలేకరుల సమావేశంలో అన్నారు. జిల్లా వైసిపి అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పై,స్థానిక మున్సిపల్ ఛైర్మెన్ ఇంటిపై దాడికి పాల్పడేవిధంగా తునిలో టిడిపి అరాచకానికి పాల్పడుతోందని అన్నారు.

19న ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి జగ్గయ్యపేట: హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ఏర్పాటు కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నట్లు హిందూ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పిన్నం వెంగళరావు తెలిపారు. సోమవారం పట్టణంలోని ధరణికోట విశ్రాంత ఉద్యోగుల భవనంలో కోర్ కమిటీ ప్రతినిధులు పబ్బతి నరేంద్ర, సంక భాస్కర్, నోముల రఘు, తూములూరి అశోక్, అల్లి రవిచంద్ లు ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ విగ్రహ ఏర్పాట్లను వివరించారు. పట్టణంలోని విజయవాడ రోడ్ లో తొర్రగుంటపాలెం చౌరస్తా వద్ద 19వ తారీకు బుధవారం చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమం, చత్రపతిశివాజీ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పట్టణంలోని పాత పేట గడ్డ వద్ద నుండి మహిళా భక్తుల కోలాటాల నడుమ , భక్తులు శివాజీ మహారాజ్ కోర్ కమిటీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరుగుతుందని వివరించారు. ముత్యాల రోడ్డు ,పెద్ద సెంటర్, రామానుజ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, కోదాడ రోడ్ లోని మార్కెట్ యార్డ్ వరకు బైక్ ర్యాలీ కొనసాగుతుందన్నారు.

సంగీత విభావరి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ : చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా అనే పేరుతో రాష్ట్రంలో ఉన్న రంగం ప్రజా సాంస్కృతిక వేదిక కళాకారుల చేత తెలుగు భాషోద్యమ గీతాలు, దేశభక్తి జానపద, సినీ, అభ్యుదయ పాటల సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయంలో 21న జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం బాలోత్సవ భవనంలో పోస్టర్ ఆవిష్కరించారు. మాతృభాష పరిరక్షణ మనందరిపై ఉందని, ఇతర భాషలతో సమానంగా మాతృభాషకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లం రెడ్డి లక్ష్మణ రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం తెలుగు భాషకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలుగు నేలపై జానపద సాంస్కృతిక సంపదను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి నగరంలో ఉన్న ప్రముఖ కళా సంస్థలు సాహితీ సంస్థలు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని భాషా పరిరక్షకులు ముందుకు రావాలని పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న సాహితీ ప్రియులు, కాంగ్రెస్ పార్టీ బిసి నాయకులు కొలనుకొండ శివాజీ అన్నారు. ఈ పాటల సందడి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అవనిగడ్డ ఎంఎల్ఏ, తెలుగు భాషా ఉద్యమ నేత మండలి బుద్ధ ప్రసాద్ పాల్గొంటున్నారని, రంగం ప్రజా సాంస్కృతిక వేదికతో పాటు జాషువా సాంస్కృతిక వేదిక, సుమధుర కళానికేతన్, జీఆర్‌కె పోలవరపు సాంస్కృతిక సమితి, జన చైతన్య వేదిక, సమతా సేవా సమితి పలు సంఘాల సం స్థల సంయుక్త నిర్వహణ లో ఈ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు రంగం రాష్ట్ర కార్యదర్శి ఆర్. రాజేష్ తెలిపారు. జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు, మామ్ ట్రస్ట్ సంఘ సేవకులు మహంతి వాసుదేవరావు, రంగం రాష్ట్ర కార్యదర్శి ఆర్.రాజేష్, రంగం కళాకారిణి ఎస్‌కె బర్కత్, తదితరులు పాల్గొన్నారు.

పిబి సిద్ధార్థలో తెలుగుభాషా పోటీలు

విజయవాడ అర్బన్ : 21న మాతభాషా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం, పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, తెలుగుశాఖ, ఏ.జి. అండ్ ఎస్.జి. సిద్ధార్థ కళాశాల, ఉయ్యూరు తెలుగుశాఖ సంయుక్త నిర్వహణలో పాఠశాల, కళాశాల స్థాయిలో తెలుగుభాషా పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. మేకా రమేష్ తెలిపారు. పద్యాలాపన, ఆంగ్ల పదాలకు తెలుగు మాటలు రాయడం, అచ్చంగా తెలుగులో మాట్లాడడం, తెలుగు గద్యపఠనం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 8374865621, 9848547022 అనే ఫోన్ నంబర్లను సంప్రదించి 19 లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతిభావంతులకు బహుమతులు, పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేస్తామన్నారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు

ప్రజాశక్తి - వత్సవాయి : అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఎన్నికల కోడ్ను పక్కాగా అమలు చేస్తున్నట్లు తహశీల్దార్ శాంతిలక్ష్మి తెలిపారు. ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ కోడు అమలులో ఉన్నందున జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పర్యటనలో తాము ఎవరిని కలవలేదని, ఆహ్వానించలేదని తెలిపారు. చెత్త సంపద, కేంద్రం పార్కును కలెక్టర్ తనిఖీ చేసిన సమయంలో గుత్తేదారు వచ్చి అక్కడ చేసిన పనులు గురించి వివరించారని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలు విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు.

రిటైర్డ్ టీచర్ నరసింహారావు మృతి



ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణానికి రిటైర్డ్ టీచర్ నీరుకొండ నరసింహారావు సోమవారం ఉదయం మృతి చెందారు. ఎస్‌టియు యూనియన్ అభివృద్ధికి నిరంతర కృషిచేసి ఉపాధ్యాయులను ఏకతాటిపై నడిపి ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసి, ఎస్‌టియు భవనం రావడానికి ఆయన కృషి ఎంతో ఉంది. రిటైర్ అయిన అనంతరం – ఆంధ్రప్రదేశ్ విడిపోయిన సమయంలో కూడా పలు ఉద్యమాల్లో పాల్గొన్నారు. పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని గరికపాడు డాక్టర్ కెవిఎల్.రావు కృషిజ్ఞాన కేంద్రంలో మూడు రోజులు పాటు షెడ్యూల్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా హరిజన (ఎస్‌సి) రైతులకు, ప్రకృతి వ్యవసాయం రైతులు, యువతకు ప్రకృతి వ్యవసాయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మొదటి రోజు సోమవారం శిక్షణ కార్యక్రమంలో భాగంగా సహజ, ప్రకృతి వ్యవసాయం మూలసూత్రాలు, నేల ఆరోగ్య పరిరక్షణ, వాన పాముల ఎరువు తయారీ అంశాల మీద ప్రకృతి వ్యవసాయ రైతులకు శిక్షణ అధికారి, శాస్త్రవేత్త డాక్టర్ పిఎన్.శివప్రసాద్ (సేద్య విభాగం) విభాగం వివిధ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పద్ధతి ప్రదర్శన ద్వారా వివరించారు. వర్మీకంపోస్ట్, అజోల్లా ఉత్పత్తి సాంకేతికతలు, శిక్షణ పొందిన వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో కెవికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో పలువార్డుల్లో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని నందిగామ మున్సిపల్ ఛైర్మన్ మండవ కృష్ణకుమారి పేర్కొన్నారు. సోమవారం నందిగామలో వార్డు సచివాలయ ఉద్యోగులతో మున్సిపల్ ఛైర్మన్ మండవ కృష్ణ కుమారి సమీక్ష చేశారు. వార్డుల్లో చెత్త చెదారం లేకుండా చేయాలని కోరారు. సున్నం, బ్లీచింగ్ చల్లించాలని సూచించారు. చెత్త చెదారం డంపింగ్ యార్డులకు తరలించాలని కోరారు. పలువురు సచివాలయ అడ్మిన్లు, టిడిపి నాయకులు మండవ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న చైర్మన్ మండవ కృష్ణ కుమారి



శోభరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

శోభరాజు వర్ధంతి

విజయవాడ : 29వ డివిజన్ మధురానగర్ సిపిఎం సీనియర్ నాయకుడు వై.శోభరాజు మూడో వర్ధంతి సోమవారం జరిగింది. ఈ సందర్భంగా బోడి మునిరాజు రామారావు రీడింగ్ వద్ద జరిగిన కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి హెచ్.బాబూరావు, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు పాల్గొన్నారు. శాఖా కార్యదర్శి బి.శివప్రసాద్, చిన్న ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మధురానగర్ ఇన్చార్జి కృష్ణమూర్తి మాట్లాడుతూ శోభ రాజు, పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడుగానూ పార్టీ శాఖ కార్యదర్శి గానూ చనిపోయే వరకు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేశారు. శోభరాజు అడుగుజాడల్లో నడవటమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళు లన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘం కార్యదర్శి బి.విజయ కుమారి చిత్రపటానికి పూలేసి నివాళులర్పించారు.

మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో అపార్టుమెంట్లు

'మహారుద్రాక్ష' అధినేత కొల్లిపర శివప్రసాద్



ప్రజాశక్తి-గన్నవరం

సామాన్యులకు, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో అపార్టుమెంట్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మహారుద్రాక్ష హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత కొల్లిపర శివప్రసాద్ తెలిపారు. గన్నవరం మండలం కేసరపల్లి నుండి ముస్తాబాద్ వెళ్లే రోడ్డు (నేషనల్ హైవే) సమీపంలో వారాహి హైట్స్ నూతన అపార్టుమెంట్ల భవన సముదాయానికి కొల్లిపర శివప్రసాద్, అనిత సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ మహా రుద్రాక్ష హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మూడవ వెంచర్‌కు భూమిపూజ చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గతంలో రెండు వెంచర్లు అతి తక్కువ ధరలలో సామాన్యులకు అందుబాటులో అందించినట్లు చెప్పారు. చేబ్రోలు లక్ష్మీ మౌనిక మాట్లాడుతూ కేసరపల్లి పంచాయితీ పరిధిలో వెంచర్లు, అపార్ట్మెంట్లు వేగంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. మౌలిక సదుపాయాలతో కూడిన ఆధునిక భవన సముదాయాలు ఇక్కడ ఏర్పాటు జరగడం, వాటిని కొనుగోలు చేయడంతో పాటు నివాసానికి ప్రజలు రావడంతో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. దీని వెనుక పొట్లూరి బసవరావు, చలసాని సురేష్ వంటి ఎంతోమంది ప్రముఖుల కృషి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిల్డర్స్ ఫోరం ప్రెసిడెంట్ నాగమల్లేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ ప్రసాద్, శరన్ కొంటి బిల్డర్స్ శంకర్రావు, ప్రముఖ బిల్డర్స్ పాల్గొన్నారు.



రబ్బీస్ క్వారీలు తెరిపించాలని లారీడ్రైవర్ల ఆందోళన

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం ప్రాంతంలో రబ్బీస్ క్వారీలు తెరిపించి లారీలకు ఉపాధి చూపించాలని కోరుతూ సోమవారం కేసరపల్లి గ్రామంలో క్వారీ లారీ యజమానులు, డ్రైవర్లు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా లారీ ఓనర్స్ సంఘం నాయకులు ప్రసాద్ మాట్లాడుతూ గత ఎనిమిది నెలలుగా కిరాయిలు లేకపోవడంతో లారీల కిస్తీలు కట్టలేని పరిస్థితి వచ్చిందన్నారు. దీంతో ఫైనాన్సర్లు లారీలను లాక్కుపోయిన దుస్థితి ఉందన్నారు. లారీ డ్రైవర్లకు కూడా జీతాలు ఇవ్వలేని దయనీయ పరిస్థితి వచ్చిందన్నారు. దీనికి కారణం గన్నవరం ప్రాంతంలో రబ్బీస్ క్వారీలు మూతపడడమే అన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా క్వారీలను తెరవలేదని చెప్పారు. ఈ ప్రభావం తమ కుటుంబాలపై పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజులపాటి శివాజీ మాట్లాడుతూ వెయ్యి కుటుంబాలు ఉపాధి లేక అల్లాడుతున్నాయని చెప్పారు. రబ్బీసు తోలడం తప్ప వేరే ఉపాధి లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం క్వారీలను తెరిపించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు లారీ డ్రైవర్ల సమస్యను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లారీ యజమానులు మల్లవల్లి శివ, టి. ప్రసాద్, రాము, కుమార్, వేముల పిచ్చేశ్వరావు, నేర్సు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ విక్రయాలపై చర్యలు

ప్రజాశక్తి-ఉయ్యూరు

ఉయ్యూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గత సంవత్సరం డిసెంబరు నుంచి ఇప్పటివరకు అక్రమంగా మద్యం విక్రయించే వారిపై దాడులు చేసి 41 మందిని అరెస్ట్ చేసి 36 కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్.శేషగిరిరావు తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ దాడుల్లో 158 లీటర్ల మద్యం సీజ్ చేశామని, వివిధ అక్రమ మద్యం విక్రయ కేసులతో సంబంధం ఉన్న 55 మందిని ఆయా మండల తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేశామని తెలిపారు. లైసెన్స్ లేకుండా మద్యం విక్రయించడం నేరమని, అక్రమ మద్యం విక్రయానికి పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బిఇడి పరీక్షల షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని బి.ఇ.డి. మొదటి సెమిస్టర్ విద్యార్థులకు వచ్చేనెల 6 నుండి 12వ తేదీ వరకు పరీక్షలుంటాయని వర్సిటీ పరీక్షల నిర్వహణ నియంత్రణాధికారి ఆలపాటి శివప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు టైం టేబుల్‌ను సోమవారం విడుదల చేశారు. రెగ్యులర్, సప్లిమెంటరీ, బి.ఇ.డి. స్పెషల్ ఎడ్యుకేషన్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు 1, 2, 3 పేపర్లకు పరీక్షలు ఉంటాయని, మధ్యాహ్నం 2 గంటల నుండి 3.30 గంటల వరకు 4, 5, 6 పేపర్ల పరీక్షలు ఉంటాయని వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఏదైనా అసౌకర్యం ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తేవాలని విద్యార్థులకు సూచించారు.

అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎఎన్‌యు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర కళాశాల పురుషుల హ్యాండ్ బాల్ పోటీలను వర్సిటీ క్రీడా ప్రాంగణంలో దూరవిద్య కేంద్రం ఇన్‌ఛార్జి డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్, టోర్నమెంట్ ప్రెసిడెంట్ ఎ.ప్రమీలరాణి అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ సభలో వెంకటేశ్వర్లు, వ్యాయామ విద్య డైరెక్టర్ పిపిఎస్.పాల్‌కుమార్ మాట్లాడుదారు. వర్సిటీ పరిధిలోని 10 కళాశాలల జట్లు రెండ్రోజులపాటు పాల్గొనే ఈ పోటీల్లో ఝిటీ వ్యాయామ విద్య కళాశాల, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల, ఎబిఆర్ డిగ్రీ కళాశాల, కందుకూరులోని శ్రీగుప్తా డిగ్రీ కళాశాల జట్లు లీగ్ దశకు చేరుకున్నాయి.

విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ (గన్నవరం)



విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలై తమ బంగారు జీవితాన్ని పాడు చేసుకోవద్దని అల్లూరి సీతారామరాజు జిల్లా డొంకరాయి సబ్ ఇన్స్పెక్టర్ టి. శివకుమార్ హితవు పలికారు. సాయి క్రియేషన్స్ గన్నవరం ఆధ్వర్యంలో బాపులపాడు మండలం ఆరుగొలను గ్రామంలోని ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు తదితర పరీక్ష సామాగ్రిని సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియా ప్రభావంతో చెడు అలవాట్లకు బానిసలు అయితే జీవితాంతం బాధపడాల్సి ఉంటుందన్నారు. ఆడపిల్లలను వేధించటం, మత్తు పదార్థాలు సేవించడం లాంటి సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడితే పోలీస్ కేసుల్లో ఇరుక్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఒక్కసారి పోలీసుల క్రిమినల్ రికార్డుల పేరు నమోదు అయితే అది జీవితాంతం వేటాడుతుందని ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎపియూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు, షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అట్లూరి రాజశేఖర్ మాట్లాడుతూ తాను కూడా ఈ పాఠశాలలోనే చదువుకున్నట్లు గుర్తుచేసుకున్నారు. విద్యార్థులు పరీక్షల పూర్తయ్యే వరకు సెల్‌ఫోన్‌కి దూరంగా ఉంటూ పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలని తద్వారా పాఠశాలకు గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లల్ని చదివిస్తున్నారని వారి కష్టాన్ని గుర్తెరిగి విద్యార్థులు చదువుకుని తల్లిదండ్రుల ఆకాంక్షల నెరవేర్చాలని సూచించారు. విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందించిన ఎస్ఎస్ క్రియేషన్స్ అధినేత డీజీఎం సాయికుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉదయ తార పత్రిక ఎడిటర్ ధనియాల అప్పారావు, జర్నలిస్టులు నల్లగంచ రామకృష్ణ, కొలుసు వాసు, పాఠశాల హెచ్ఎం దుర్గాప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.పద్మ, ఎ.ఉషా కుమారి, కె.తాతబాబు, పిడిజి ఎన్.సుబ్బారావు పాల్గొన్నారు.



శివరాత్రి బ్రహ్మోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-మోపిదేవి: మండలంలోని పెదకళ్లేపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ దుర్గా నాగేశ్వర స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 23వ తేదీ ఆదివారం నుండి వచ్చే నెల 3వ తేదీ సోమవారం వరకు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. 26న కల్యాణ మహోత్సవం, 27న రథోత్సవం, 28న వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించి గోడపత్రికను సోమవారం చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల డిప్యూటీ కమిషనర్ ఎగ్జిక్యూటివ్ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆవిష్కరించారు.

గుడివాడ ఉప విద్యా శాఖాధికారిగా రవికుమార్

ప్రజాశక్తి-గన్నవరం



గుడివాడ డివిజన్ ఉప విద్యా శాఖాధికారిగా గన్నవరం మండల విద్యా శాఖాధికారి కొండా రవికుమార్‌ని నియమిస్తూ పాఠశాల విద్యా శాఖ కమిషనర్ వి.విజయరామరాజు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. రవికుమార్ గుడివాడ ఉప విద్యా శాఖధికారిగా నియమితులు కావడం పట్ల ఆంధ్రప్రదేశ్ వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం ఉపాధ్యక్షులు ధనియాల నాగరాజు, యుటిఎఫ్ నాయకులు మరీదు వరప్రసాద్, రాజబాబు, గొట్ట రవికుమార్, ఎస్‌టియు నాయకులు సాగర్ అభినందనలు తెలిపారు.

చిన్నారికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మోపిదేవి: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మోపిదేవి కాలనీకి (అంబేద్కర్ నగర్)కు చెందిన చిన్నారికి నాగాయలంక మండలంలోని రేమాలవారిపాలెంకు చెందిన చెన్ను రంగారావు తన వంతు ఆర్థిక సహాయం అందించారు.



పెండ్ర నాగలక్ష్మణ మణికుమార్, ఝాన్సీ దంపతుల కుమార్తె అనారోగ్యంతో బాధపడుతుండటంతో రంగారావు తన వంతు సహాయంగా ఐదు వేల రూపాయల నగదును మోపిదేవి ఎస్సై వీర వెంకట సత్యనారాయణ చేతుల మీదగా సోమవారం అందజేశారు.



వీరమ్మ తిరునాళ్లకు యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి-ఉయ్యూరు

వీరమ్మ తిరునాళ్లకు యాత్రికుల రద్దీ కొనసాగుతుంది. తిరునాళ్లలో పదవ రోజైన సోమవారం అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకునేందుకు పలు ప్రాంతాల నుంచి యాత్రికులు వేకువజాము నుంచి తరలివచ్చి పొడవాటి క్యూల్లో నిలుచున్నారు. శనివారంతో తిరునాళ్ల ముగియనుండగా అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులతో పాటు పలువురు ప్రముఖులు వస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పాలపొంగళ్లు తయారు చేసి నైవేద్యం సమర్పించగా, పసుపు కుంకుమ, చీరలు, కొబ్బరికాయల స్టాళ్ల వద్ద మరీ రద్దీ కన్పించింది. మంగళవారం అమ్మవారి శిడిబండి కార్యక్రమం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. శిడిబండి వేడుకలో ఎవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

ఇంజినీరింగ్ విద్యపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: స్థానిక శేషాద్రి గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో జాయ్ ఆఫ్ ఇంజినీరింగ్‌పై మొదటి సంవత్సరం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎన్‌టియుకె కాకినాడ ఉపకులపతి డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యను సునాయాసంగా అభ్యసించడానికి కావలసిన వనరులు, తీసుకోవలసిన జాగ్రత్తలు, క్రమశిక్షణ తదితర అంశాలపై వివరించారు. ఐట్టీ పట్టడం వల్ల చదువు కుంటుపడుతుందని, అర్థం చేసుకుని చదవడం ద్వారా విశ్వ జ్ఞాన సముపార్జన జరుగుతుందని హితవు పలికారు. మొదటి సంవత్సరం నుండే ప్రతీ విషయంపై దృష్టి నిల్పి అకుంఠిత దీక్ష, పట్టుదలతో విజయ శిఖరాలను అధిరోహించాలని అన్నారు. అనంతరం మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండరామారావు, డాక్టర్ శాస్త్రి, డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్, యాజమాన్యం సలహాదారులు రవీంద్రబాబు పాల్గొన్నారు.



మురళీకృష్ణను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - వత్సవాయి, కంచికచర్ల : కంచికచర్ల మండలంలో గల జడ్‌పిహెచ్ పాఠశాలలు, కంచికచర్ల స్కూల్, శ్రీ అక్షర పబ్లిక్ స్కూల్, జడ్పీహెచ్‌ఎస్ పరిటాల, జడ్పీహెచ్‌ఎస్ గని ఆత్కూరు, ఎంపీపీ చెవిటికల్లు స్కూల్‌లో ఈ నెల 18 నుండి 21 తేదీ వరకు నాలుగు రోజులుపాటు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ లక్ష్మీ కుమారి సోమవారం తెలిపారు. ఈ ఆధార్ క్యాంపుల వద్ద కొత్తగా ఆధార్ కార్డు నమోదు చేసి, 5 సంవత్సరాలు దాటిన పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్, ఆధార్ కార్డు పొంది పది సంవత్సరాలు పూర్తయిన ప్రతి ఒక్కరు డాక్యుమెంట్ అప్డేట్, బయోమెట్రిక్ అప్డేట్ చేసుకోవాలని, అడ్రస్ మార్పులు చేర్పులు ఈ పైన తెలిపిన సర్వీసులు చేయడం జరుగుతుందన్నారు. కంచికచర్ల మండల పరిధిలో ఉన్న ప్రజలందరూ ఈ ఆధార్ మొబైల్ క్యాంపులు ఉపయోగించుకోవాలని సూచించారు. వత్సవాయి మండల పరిధిలో ఆయా గ్రామాల సచివాలయంలో 18న మక్కపేట, మాచినేని పాలెం, 19వ తేదీన మంగోల్లు, కాకరవాయి, 20వ తేదీన కన్నివేడు, ఖమ్మంపాడు, 21న ఇందుగుపల్లి వేమవరం, ఆయా గ్రామాల్లో సచివాలయంలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - భవానీ పురం : భవానీపురం పరిధిలోని 11 కె.వి. ఐరన్ యార్డ్ ఫీడర్ లైన్ల మరమత్తులలో భాగంగా ఈ నెల 18వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు (3 గంటలు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయవాడ టౌన్ పి.రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరెంట్ ఆఫీస్ ఎదురు పాత ఎంఐజి బ్లాకులు, ఎల్‌ఐజి బ్లాకులు, ఐరన్ యార్డ్, రిలయన్స్ పక్కన పడమటవారి వీధి వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని చెప్పారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బాలల హక్కుల పరిరక్షణ ఫోరం కో కన్వీనర్‌గా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆదివారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ ఐక్యవేదిక మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీలో కో కన్వీనర్‌గా పెంటి శ్రీనివాసరావును నియమించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బాలల హక్కుల పరిరక్షణ ఫోరం 2004లో జాతీయస్థాయిలో వివిధ రాష్ట్రాల్లో ఎంవి.ఫౌండేషన్ సౌజన్యంతో పనిచేస్తుంది. బాలల హక్కులను కాపాడే లక్ష్యంతో వివిధ శాఖల భాగస్వామ్యం చేయనున్నట్లు తెలిపారు. శిశు మరణాలపై అవగాహన, పర్యవేక్షణ ఈ చైల్డ్ ఫార్మ్ యొక్క లక్ష్యాలపై పనిచేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జాతీయ సిఆర్పిఎఫ్ కన్వీనర్ వెంకట్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి ధనసిరి ప్రకాష్, రాష్ట్రం నుంచి అన్ని జిల్లాల నుంచి ఈ ఫోరం ప్రతినిధులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని ముక్త్యాల గ్రామంలో గల శ్రీ భవానీ ముక్తేశ్వర స్వామి వారి దేవస్థానం, శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి-2025 సందర్భంగా ఈ నెల 23 నుండి మార్చి 3, 2025 వరకు జరుపు శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 26వ తేదీ శివరాత్రి రోజు నిర్వహించే శ్రీ స్వామి వారి కళ్యాణానికి విచ్చేసే కల్పించాల్సిన సౌకర్యాలు, చేయవలసిన ఏర్పాట్ల గురించి చర్చించేందుకు నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటల నుండి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో దేవాలయ ప్రాంగణంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వి.ఎల్.ఇందిరాదత్తు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు.

లైఫ్‌లైన్ డయాగ్నోస్టిక్స్ క్లినిక్స్ ప్రారంభం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో సోమవారం లైఫ్‌లైన్ డయాగ్నోస్టిక్స్ అండ్ స్పెషాలిటీ క్లినిక్స్‌ను ఏపీ ప్రభుత్వ విప్ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య ప్రారంభించారు. యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. నిర్వాహకులు మన్నే సత్య నారాయణ, మమ్మీడాడి నరసింహారావు పలువురు ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.



ప్రధాన రహదారిని విస్తరించాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ ప్రధాన రహదారి విస్తరణ అత్యంత అవశ్యకమని కొండపల్లి మున్సిపాలిటీ పెద్దలు అభిప్రాయపడ్డారు. కొండపల్లి మున్సిపాలిటీ ప్రధాన రహదారి విస్తరణ అనే అంశంపై కొండపల్లి ఆర్యవైశ్య కళ్యాణమండపం జరిగిన మున్సిపాలిటీ ముఖ్యులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కొండపల్లి మున్సిపాలిటీలో ఎప్పటినుండో పరిష్కారం కానీ సమస్యలైన కొండపల్లి మెయిన్ రోడ్డు విస్తరణ, కాలుష్య నివారణ, స్మశానం అభివృద్ధి, క్రీడా మైదానం, బస్టాండ్ లాంటి సమస్యలు పరిష్కారం కొరకు చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ కొండపల్లి మున్సిపాలిటీ మెయిన్ రోడ్డు వెడల్పు అవసరం అని అభిప్రాయపడ్డారు. స్వచ్ఛమైన నీరు, గాలి, మెరుగైన రవాణా సౌకర్యాలు మున్సిపాలిటీలను ప్రజలకు అత్యంత అవశ్యకమని తెలిపారు. కొండపల్లి మెయిన్ రోడ్‌లో వాహనాలు నడపాలంటేనే చాలా ఇబ్బందికరమైన వాతావరణం ఉందని తెలిపారు. అందరూ ఉమ్మడిగా కార్యాచరణ ఏర్పాటు చేసుకొని ప్రధాన రహదారి విస్తరణకు పూనుకోవాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి మరొకసారి సమావేశం ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో కార్యాచరణను ముందుకు తీసుకు వెళ్లేలా చర్చించు కోవాలని తీర్మానం చేశారు. కొండపల్లి మున్సిపాలిటీ కాలుష్యంతో నింపేస్తున్న డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ యాజమాన్యం నుంచి రావలసిన సిఎస్‌ఆర్ ఫండింగ్ రూ.25 కోట్లు వచ్చేలా ఉమ్మడిగా కార్యాచరణ రూపొందిస్తే తప్పనిసరిగా కొండపల్లికి కావలసిన మౌలిక సదుపాయాలన్నీ ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మైలవరం అధ్యక్షులు అక్కల గాంధీ, కాంగ్రెస్ పార్టీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షులు బొర్రా కిరణ్, ఎన్టీఆర్ జిల్లా జనసేన ఉపాధ్యక్షులు శ్రీకాంత్, సెంట్రల్ ఆంధ్ర కమిటీ సభ్యులు నాని, కొండపల్లి మున్సిపాలిటీ జనసేన అధ్యక్షులు చెరుకుమల్లి సురేష్, టిడిపి అధ్యక్షులు చుట్టకుదురు శ్రీను, బిజెపి అధ్యక్షురాలు మాధురి,సిపిఐ అధ్యక్షులు బాషా, వైసీపీ అధ్యక్షులు శరభయ్య, కౌన్సిలర్లు వాసు, బ్రహ్మోజీ, బేగ్, నాగమల్లి, కొండపల్లికి చెందిన వైద్యులు సత్తార్, దేవదాసు రెడ్డి, గంగా మధుసూదనరావు, శీతారామారావు, కొండపల్లి పెద్దలు, అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

కెఎస్ లక్ష్మణరావు గెలుపు కోసం ప్రచారం

ప్రజాశక్తి - కంచికచర్ల : ప్రజా సమస్యల గొంతుక కెఎస్ లక్ష్మణరావు విజయం అవసరమని పలువురు పిలుపునిచ్చారు. మండలంలో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కల్యాణ్ మాట్లాడారు. ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కెఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక 1, 2వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్.వెంకటేశ్వరరావు, ఎస్.కె.జాహిద పాల్గొన్నారు. **నందిగామ :** ఎస్‌ఎఫ్‌ఐ, సిఐటియు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. నందిగామ మండలం పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. కృష్ణ, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ, ఉద్యోగ ఉపాధ్యాయ, అధ్యాపక, పెన్షనర్లు, నిరుద్యోగ, కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులు, వివిధ ప్రజా సంఘాల, బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి, నిరంతరం కార్మికులకు ఉద్యోగులకు ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండే వ్యక్తి ప్రజల కోసం పోరాటం చేసే వ్యక్తి అధికారం ఉన్న లేకపోయినా కార్మికుల కోసం ఉద్యోగుల కాంట్రాక్ట్ ఉద్యోగుల కోసం నిత్యం పోరాడే వ్యక్తి ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె.గోపాల్, ఎస్‌ఎఫ్‌ఐ గోపినాయక్, రాము, రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** మండలంలోని గండ్రై గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఓటర్లకు కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కోటా రవికుమార్, బాలు, దంతాల వెంకటే తదితరులు పాల్గొన్నారు.



కంచికచర్లలో ప్రచారం చేస్తున్న కళ్యాణ్, తదితరులు



నందిగామలో ప్రచారం చేస్తున్న దృశ్యం



జగ్గయ్యపేటలో

చెత్త సంపద కేంద్రాలను పునరుద్ధరించాలి : డిఎల్‌పిఒ

ప్రజాశక్తి - గంపలగూడెం: చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను వెంటనే పునరుద్ధరించాలని డివిజనల్ అధికారి జిఎల్‌వి రాఘవన్ ఆదేశించారు. ఇటీవల మండలంలో అనుములంక గ్రామంలో ఉన్న పౌల్ట్రీ ఫామ్‌లో కోళ్ల మృతిచెందడంపై డిఎల్‌పిఒ స్పందించారు. ఈ విషయమై సోమవారం పౌల్ట్రీ ఫామ్‌ను సందర్శించి, పంచాయతీ కార్యదర్శి మరీదు హరిణి పారిశుధ్య పనులపై సూచనలు చేశారు. అనంతరం స్థానిక మండల పరిషత్‌లో పంచాయితీ కార్యదర్శులతో సమావేశమై మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను క్లాప్ మిత్రాల ద్వారా సేకరించాలని ఆదేశించారు. గ్రామాల్లో చెత్తను తరలించే రిక్షాలు లేకపోతే 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి కొనుగోలు చేసుకోవాలని తెలిపారు. దుకాణాల వద్ద మూడు రకాల డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేయాలని వివరించారు. పారిశుధ్య పనులపై సక్రమమైన రీతిలో పర్యవేక్షించి, తగు చర్యలు తీసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇఒ అండ్ పిఆర్‌డి దాకరపు బాబురావు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



తిరుపతమ్మను దర్శించుకున్న భాస్కర్

ప్రజాశక్తి - వత్సవాయి : హైదరాబాదు బాచుపల్లి ఎసిబి కాపు రాక్స్ ఫౌండర్ పెద్దిరెడ్డి శివ భాస్కర్ పెనుగంచిప్రోలులో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు అనంతరం మొక్కులు తీర్చుకున్నారు ఆయనకు అర్చకులు పండితులు ఆశీర్వాదం చేసి శేష వస్త్రం ప్రసాదాలు అందించారు. ప్రముఖ కాపు సంఘం యనమదల శ్రీనివాసరావు గోబిశెట్టి గోపాల్ ఆయనకు అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. కాపు సంఘం ప్రముఖులు యనమదల సాయి, కృష్ణారావు, చరణ్, వినయ్ పాల్గొన్నారు.

శ్రీ అంకమ్మ దేవస్థానం వార్షికోత్సవం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండల కేంద్రమైన రెడ్డిగూడెంలోని శ్రీ అంకమ్మ తల్లి దేవస్థానం వార్షికోత్సవంలో మైలవరం ఎంఎల్‌ఎ వెంకట కృష్ణప్రసాదు సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో అమ్మవారిని దర్శించు కున్నారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. యాత్రికులు, ఎన్‌డిఎ కూటమి నాయకులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను సోమవారం లబ్ధిదారులకు ఎంఎల్‌ఎ అందజేశారు. పట్టణంలోని రఘురాం కార్యాలయంలో సోమవారం మండలంలోని వేదాద్రి గ్రామానికి చెందిన బండి బసవరాజుకు రూ.73,079 చెక్కు, బండి వీరయ్యకు రూ.74,646ల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కన్నా జానకి రామయ్య, నాయకులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని చిల్లకల్లు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామపంచాయతీ కార్యవర్గం మండల పిఒపిఆర్డి పద్మావతి ఎలక్షన్ అధికారిగా వ్యవహరించారు. మండల గ్రామ పంచాయితీ సెక్రటరీల మండల సంఘం అధ్యక్షుడిగా ముక్త్యాల గ్రామపంచాయితీ సెక్రటరీ జి.శ్రీనివాస రెడ్డి, జనరల్ సెక్రటరీ సాయిసంధ్య, కోశాధికారిగా సైదానాయక్, మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రావణ్ కుమార్, జగ్గయ్య, శివాజీ తదితరులు పాల్గొన్నారు.



బ్రూనోకు నివాళులు

ప్రజాశక్తి - తిరువూరు : సత్యాన్వేషణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రముఖ ఖగోళ శాస్త్ర వేత్త గియనార్డో బ్రూనో వర్ధంతిని జెవివి ఆధ్వర్యంలో జరిగింది. కోపర్నికస్ ప్రతిపాదించిన సూర్య కేంద్రక సిద్ధాంతాన్ని బలపరిచినందుకు బ్రూనోను ఆనాటి మతోన్మాదులు దారుణంగా చంపారని, ఆయన వర్ధంతిని ప్రపంచ వ్యాప్తంగా సత్యాన్వేషణ దినోత్సవంగా జరుపుతారని జెవివి మండల ప్రధాన కార్యదర్శి డి.సుదర్శన్ తెలిపారు. ఈ సందర్భంగా బ్రూనో చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యదర్శి ఎం.రాంప్రదీప్, పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు వి.సాయిరాం, ఉపాధ్యాయులు ఎస్.రామారావు, ఎం.సాంబశివరావు, ఎ.వెంకటేశ్వర్లు, బి.రాము తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణరావును గెలిపించాలని విస్తృత ప్రచారం



గన్నవరంలో మాట్లాడుతున్న బొడ్డు నాగేశ్వరరావు



ప్రజాశక్తి-ఉంగుటూరు: ప్రతి క్షణం ప్రజా శ్రేయస్సును కాంక్షిస్తూ ప్రజా సమస్యల పరిష్కార కోసం శాసనమండలిలో, బయట పోరాటం చేస్తున్న కెఎస్ లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు అజ్మీరా వెంకటేశ్వరరావు కోరారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎవరి సమస్యనైనా ప్రస్తావించి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పులి శ్రీనివాస్, పిల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును తప్పకుండా గెలిపించుకోవాల్సిన బాధ్యత పట్టభద్రులు, ఉపాధ్యాయులపై ఉందని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. సోమవారం గన్నవరం పట్టణంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ అందరూ ఆలోచన చేసి లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కర్రా వరప్రసాద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి: ఎమ్మెల్సీ ఎన్నికలలో పట్టభద్రుడు అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె ఎస్ లక్ష్మణరావు కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మోపిదేవి మండలంలో విస్తత ప్రచారం చేపట్టారు. మోపిదేవి మండల సిఐటియు కార్యదర్శి సిరివెళ్ల రాజశేఖర్, మద్దాల వెంకటేశ్వరావు, యుటిఎఫ్ నాయకులు కనకారావు, మండల కమిటీ సభ్యులు మరిదు సురేష్ బాబు తదితరులు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న సిబ్బందిని కలిసి లక్ష్మణరావు గెలుపు ఆవశ్యకతను వివరించారు.



అమలు కాని ఎన్నికల నిబంధన

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: మండలంలోని ఐలూరు గ్రామంలో ఎంఎల్‌సి ఎన్నికల నిబంధనలు అమలు కావడం లేదు. అధికార టిడిపి, జనసేన జెండాలు రెపరెపలాడుతున్నాయి. ఎంఎల్‌సి కోడ్ అమల్లో ఉన్నప్పటికీ పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న ఆయా పార్టీ దిమ్మలపైన జెండాలు ఎగురుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వాసుపత్రిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాల వద్ద స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించినట్లు వైద్యశాల సూపర్డెంట్ డాక్టర్ ఎం విజయ్‌కుమార్ తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రం చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వైద్యశాలలో తడి చెత్త పొడి చెత్త చెత్త బుట్టల నిర్వహణపై అవగాహన కల్పించారు. వైద్యశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం వైద్యశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలకు పుష్కలంగా అవకాశాలు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: సైన్స్, ఇంజినీరింగ్, టెక్నాలజీ, మెడిసిన్ రంగాల్లో పరిశోధనలకు భవిష్యత్‌లో అవకాశాలు పుష్కలంగా ఉంటాయని జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీ సీనియర్ సైంటిస్ట్, విశ్రాంత ఆచార్యులు అప్పజోస్యుల శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కృష్ణా విశ్వవిద్యాలయం లో కెమిస్ట్రీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు ఆచార్య ఎన్ ఉష, రసాయన శాస్త్ర విభాగ అధిపతి డా. సుజాత, పరీక్షల నియంత్రణ అధికారి డా. వీర బ్రహ్మాచారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.అనంతరం శ్రీనివాసరావు ను ఘనంగా సత్కరించారు.

ఎంఎల్‌సి ఎన్నికలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-గన్నవరం: ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటు వేసే విషయంలో పలువురు పొరపాట్లు చేస్తున్నారని, దీంతో చాలా ఓట్లు చెల్లకుండా పోతున్నాయని తహశీల్దార్ శివయ్య అన్నారు. సోమవారం కేసరపల్లి వేములపల్లి కోదండరామయ్య కళాశాలలో ఎమ్మెల్సీ ఓటింగ్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. శివయ్య మాట్లాడుతూ ఈ నెల 27న కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగే ఎన్నికల్లో ఓటర్లు వారి హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. ఒకటికి రెండు సార్లు ఓటు వేసే విషయంలో అవగాహన పెంచుకోవాలన్నారు. తప్పులకు ఆస్కారం లేకుండా నిర్ణీత ప్రమాణాల ప్రకారం నచ్చిన అభ్యర్థికి ప్రాధాన్యత క్రమంలో ఓటేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, ఎలక్షన్ డిటి కిషోర్ పాల్గొన్నారు.

10కె రన్‌లో త్రివేణి విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-గుడివాడ : ఈ నెల 16వ తేదీన ఎన్‌టిఆర్ స్టేడియంలో పర్వతనేని జగన్‌మోహనరావు 20వ వర్థంతి సందర్భంగా నిర్వహించిన 10కె రన్‌లో త్రివేణి విద్యార్థి కె.గౌతమ్ ఉత్తమ ప్రతిభ కనబరచి నగదు, మెడల్, సర్టిఫికెట్ సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ నిమ్మగడ్డ శివశంకర్ తెలిపారు. సోమవారం స్థానిక త్రివేణి పాఠశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని ఆయన అభినందించారు. ఈ క్రీడలతో ఇతర పోటీలలో త్రివేణి విద్యార్థులు ప్రథమ బహుమతులను సాధించడం అభినందనీయమన్నారు.





గొలుసు అందజేత

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

పోగొట్టుకున్న బంగారపు చైన్‌ను 24 గంటల్లోనే బాధితునికి అందజేసిన సంఘటన సోమవారం చిలకలపూడి పోలీస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మచిలీపట్నం చిలకలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్లో ఆకునూరి కోటేశ్వరరావు అనే వ్యక్తి ఆదివారం తన యొక్క వ్యక్తిగత అవసర నిమిత్తం బయటకు వచ్చాడని ఆ సమయంలో గాంధీనగర్ వద్ద తన యొక్క బంగారు చైన్ ను పోగొట్టుకున్నాడు. అది గమనించి వెంటనే చుట్టుపక్కల వెతికిన ఎక్కడా దొరకపోవడంతో చిలకలపూడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఫిర్యాదు అందుకున్న వెంటనే పోలీసు వారు ఆ చుట్టుపక్కల ఉన్న సిసి కెమెరాలు అన్నిటిని పరిశీలించి, చుట్టుపక్కల వారిని విచారించి పోగొట్టుకున్న చైన్ ను గుర్తించి ఇన్స్పెక్టర్ అబ్దుల్ నబీ చేతులు మీదుగా సోమవారం బాధితునికి అందజేయడం జరిగింది.ఇక దొరకదు అనుకున్న తన చైన్ ను గుర్తించి అందజేసినందుకు బాధితులు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు, బందరు డిఎస్పీ సిహెచ్.రాజా, చిలకలపూడి ఇన్స్పెక్టర్ అబ్దుల్ నబీ, హెడ్ కానిస్టేబుల్ మల్లికి కృతజ్ఞతలు తెలిపారు.

బిసి సంఘం ప్రధాన కార్యదర్శిగా రావులకొల్లు

ప్రజాశక్తి-గుడివాడ: రాష్ట్ర బిసి చైతన్య సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా రావులకొల్లు వెంకటమల్లేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర బిసి చైతన్య సంక్షేమ సంఘం సమావేశంలో అధ్యక్షురాలుగా వేములపల్లి బేబీరాణి, ప్రధాన కార్యదర్శిగా రావులకొల్లు వెంకట మల్లేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఉపాధ్యక్షులుగా అగస్తి ఆదివిష్ణు, అధికార ప్రతినిధిగా షేక్ సయ్యద్, రాష్ట్ర నాయకులుగా నైనవరపు శేషబాబు, బోయిన సోమశేఖర్, దొండపాటి వెంకటకృష్ణారావులు ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన బిసిలకు రిజర్వేషన్ కల్పించాలన్నారు.

పాడి రైతులకు అండగా ఉంటాం : చలసాని

ప్రజాశక్తి-ఘంటసాల

పాడి రైతులకు మరింత అండగా నిలిచేలా కృషి చేస్తామని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. ఘంటసాల మండలం చిట్టూర్పు పాలకేంద్రం వద్ద విజయ సంస్థ 60 ఏళ్ల వజ్రోత్సవ వేడుకలు పాలకేంద్రం ప్రెసిడెంట్ దాసరి శివ వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆంజనేయులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. విజయసంస్థ 60 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లు తట్టుకుని సహకరా వ్యవస్థలో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. రైతులు, వినియోగదారుల నమ్మకం నిలబెట్టుకుంటూ ఉద్యోగుల సహకారంతో రాబోయే రోజుల్లో మరిన్ని మెరుగైన ఫలితాలు సాధిస్తామన్నారు. పాలు సేకరణ మరింత పెంచాలని పాడి రైతులను ఆంజనేయులు కోరారు. అనంతరం పాలకేంద్రంలో మూడు తరాలుగా పాలు సరఫరా చేస్తున్న రైతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విజయ డైయిరీ బోర్డు సభ్యులు వేమూరి సాయి వెంకటరమణ, పామర్రు మేనేజర్ గోపినాథ్. సూపర్ వైజర్ సురేష్. పాలకేంద్రం కార్యదర్శి పీవీ నరసింహారావు, దాసరి కుటుంబరావు, పిడికిటి బాబూరావు, పరుచూరి శేషగిరిరావు, పరుచూరి రాంబాబు, పాతూరి రాజేశ్వరరావు, పెనుమాక బాలకృష్ణ, కొడాలి వీర రాఘవులు, తాతినేని సాయికృష్ణ ప్రసాద్, చాట్రగడ్డ గిరిరాజు, కొడాలి రమేష్. బత్తుల వెంకటాద్రి, కాకి నెలబాలుడు, పాడి రైతులు పాల్గొన్నారు.



పాడి రైతులను సన్మానిస్తున్న ఆంజనేయులు

బాలుర వసతి గృహంలో తనిఖీలు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నం మండలం పల్లెతాళ్లపాలెంలో ఉన్న బిసి బాలుర వసతి గృహాన్ని జిల్లా జడ్జి అరుణ సారిక సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి.ఆర్.కృష్ణయ్య, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి ముసలయ్యతో కలిసి వసతి గృహంలో భోజనశాల, వంటగది, పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తులు వివిధ చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నందున వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి ఎండి షాహితుల్లా పాల్గొన్నారు.



అవగాహనతో ఓటు హక్కు వినియోగించుకోవాలి



ప్రజాశక్తి-ఘంటసాల: సామాజిక చైతన్యం మరియు పోటీలో ఉన్న అభ్యర్థుల గురించి పూర్తి అవగాహన కలిగి ఉండి పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు తెలిపారు. ఘంటసాల మండలంలో వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు వేసే విధానం, కౌంటింగ్ ప్రక్రియ గురించి అవగాహన కల్పించారు. ఓటు హక్కు వినియోగం ,కౌంటింగ్ ప్రక్రియ పై అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు.ఈసందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ ఉద్యోగులందరూ తప్పనిసరిగా సామాజిక,రాజకీయ చైతన్యం కలిగి ఉండాలన్నారు. తద్వారా ప్రజాస్వామ్యంలో సమర్థత గల నేతలను చట్ట సభలలోకి పంపే అవకాశం ఉంటుందన్నారు. మొదటిసారి ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకునే ఓటర్లు ఓటు వేసే విధానం గురించి పూర్తిగా తెలుసుకోవాలని అన్నారు.ఓటు వేసే విధానంలో పొరపాట్లు చేస్తే ఓట్లు చెల్లకుండా పోతాయన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన ఏదైనా గుర్తింపు కార్డును తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి తీసుకు వెళ్లాలన్నారు.ఈకార్యక్రమంలో ఉద్యోగులు బిజె అశ్విని కుమార్, కొడాలి శివకష్ణ, బెల్లంకొండ నాగలక్ష్మి,కె.శ్వేత, జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విపిఎస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : జాతీయ సామాన్య శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మొఘల్ రాజపురంలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో సింటిల్లా 6.0ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేలా వివిధ ఈవెంట్స్ ద్వారా పోటీలను నిర్వహించింది. ఈ పోటీలలో వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతులు గెలుపొందారు. విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య , వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి రోజ్ మేరీ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

జాతీయ కరాటేలో వారియర్ మార్షల్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఇటీవల తెలంగాణ రాష్ట్రంలోని నారాయణపేటలో జరిగిన 24వ జాతీయ కరాటే పోటీలు – 2025లో జగ్గయ్యపేట వారియర్ మార్షల్స్ అకాడమీకి చెందిన ముగ్గురు విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. కుమితే, కట విభాగాల్లో దైనిక (గోల్డ్ మెడల్), ప్రేమ్ కుమార్ (బ్రంజ్ మెడల్), జితేంద్ర (గోల్డ్ మెడల్) సాధించినట్టు కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జాయింట్ సెక్రటరీ ఇ.పూజ తెలిపారు.

నేతల విగ్రహాలకు సిమెంటు సంచులతో ముసుగు

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలులో ఉమ్మడి కృష్ణ గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల కోడ్ ఉన్నందున దివంగత మాజీ ప్రధాని రాహుల్ గాంధీ విగ్రహానికి, టిడిపి వ్యవ స్థాపక అధ్యక్షులు మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహానికి సిమెంటు సంచు లతో మూసివేశారు. కానీ ఎన్నికల కోడ్ నిబంధన ప్రకారం విగ్రహాలకు క్లాత్‌తో చుట్టాల్సి ఉంది. మన అధికారులు ఒక అడుగు ముందుకేసి క్లాత్‌కు బదులు బదులు సిమెంటు సంచులను వాడారు. ఇదేనా మన నేతలకు ఇచ్చే గౌరవం అంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు. అధికారులు వెంటనే సిమెంటు సంచుల స్థానంలో క్లాత్‌తో ముసుగు వేయాలని పెనుగంచి మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్ బాబు కోరారు.



స్కాలర్షిప్ పరీక్షలో 'డిఎస్‌సిఎం' విద్యార్థుల ఉత్తీర్ణత

ప్రజాశక్తి - భవానీపురం : దళవాయి సుబ్బరామయ్య నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యాధరపురం విజయవాడ ఎనిమిదో తరగతి విద్యార్థులు సింహాద్రి ఇందు, పచ్చిపులుసు సాయి హరిచరణ్ ప్రభుత్వం నిర్వహించే నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్షిప్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రతినెల రూ.1000 లు చొప్పున రాబోయే నాలుగు సంవత్సరాలు వీరి విద్యా అవసరాల నిమిత్తం ప్రభుత్వం వీరి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుంది. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన ఈ విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాతంగి కోటయ్య సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు కె.జ్యోతిర్మయి, కె.శివపార్వతిలను ప్రధానోపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జె.భాను ప్రకాష్, వి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు కోటయ్య

గణిత ఉపాధ్యాయుడికి డాక్టరేట్



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మూలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కొచ్చర్ల మోహనరావు, తన పీహెచ్డీ పరిశోధనలో భాగంగా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లాలో మాధ్యమిక విద్యా స్థాయిలో తొమ్మిది, పదవ తరగతుల విద్యార్థుల యొక్క గణిత శాస్త్ర అభ్యసన సామర్థ్యాలు, ఫలితాలు మరియు ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలపై, డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిపార్ట్మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ శాఖాధిపతి ప్రొఫెసర్ జి. మేరీ సునంద పర్యవేక్షణలో "రోల్ ఆఫ్ టీచర్స్ కాంపిటెన్సీస్ అండ్ యాటిట్యూడ్ ఇన్ రిలేషన్ టు పెర్ఫార్మెన్స్ ఆఫ్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్ ఇన్ ఎన్టీఆర్ డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్" అనే పేరుతో తెలంగాణా రాష్ట్రంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధనా గ్రంథానికి గాను, విశ్వవిద్యాలయం వారు తనకు డాక్టరేట్ ప్రకటించారని మోహనరావు తెలిపారు. ఈ నెల 13 వ తేదీన విశ్వవిద్యాలయంలో జరిగిన ఒక పరిశోధనా సదస్సులో మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా. ముస్తాక్ అహ్మద్ పటేల్ బాహ్య పరిశీలకుడిగా వ్యవహరించగా, తన పరిశోధనా గ్రంథాన్ని విశ్వవిద్యాలయం వారికి సమర్పించారు. ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది డాక్టర్ మోహనరావును ప్రత్యేకంగా అభినందించారు.

మునేటి తీరం వద్ద చెత్త తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నుండి మధిర వెళ్లే రోడ్లో చిన్న బ్రిడ్జి వద్ద ఉన్న చెత్తా చెదారం దాని నుంచి వచ్చే పొగ వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అని ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య స్పందించారు. సౌమ్య సూచన మేరకు సోమవారం ఉదయం నందిగామ మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణకుమారి వెంటనే దగ్గర ఉండి అక్కడ ఉన్న చెత్తను వెంటనే డంపింగ్ యార్డ్ తరలించి అక్కడ శానిటైజేషన్ చేయించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రమణబాబు, కూటమి సభ్యులు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నందిగామలో మునేటి తీరం వద్ద చెత్త తొలగించి దగ్దం చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణ కుమారి

ఎన్‌టిటిపిఎస్ సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :

దేశంలోనే ప్రతిష్టాత్మకమై, ఈ ప్రాంత అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించిన విద్యుత్ కేంద్రమైన, డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రంపైన, యాజమాన్యంపై చేసిన నిరాధారమైన ఆరోపణలను, పెట్టిన అక్రమ కేసులను నిరసిస్తూ డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ విద్యుత్ ఉద్యోగ సంఘాలు ఖండిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం, ఎపిఎస్ఇబి ఇంజనీర్స్ అసోసియేషన్, ఎఇఇ అసోసియేషన్, ఏపీ ఎస్సీబీ ఎస్సీ అండ్ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్, 327 యూనియన్, ఇతర అన్ని ఉద్యోగ కార్మిక సంఘాలు తీవ్రంగా స్పందిస్తూ స్థానిక విద్యుత్ కేంద్రం యాజమాన్యంపై పెట్టిన అక్రమ కేసులను ముక్తకంఠంతో ఖండించాయి. చీఫ్ ఇంజనీర్ టి.నాగరాజు ఆధ్వర్యంలో విద్యుత్ కేంద్రం రికార్డు స్థాయి జనరేషన్ సాధిస్తూ ఎన్నో రికార్డులు సాధిస్తూ వస్తోందని అన్నారు. ఈ సంస్థలో కాంట్రాక్టు కార్మికుల నుంచి చీఫ్ ఇంజనీర్ వరకు అందరూ రాత్రి పగలు శ్రమిస్తూ, ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి, నిరంతరం ప్రజలకు కావలసిన విద్యుత్తును ఉత్పత్తి చేస్తూ ఉంటారని అన్నారు. సంస్థలో పనిచేసే ప్రతి ఉద్యోగి, కార్మికుడు అందరికంటే ముందుగా కాలుష్య బారినపడి రకరకాల ఆరోగ్య సమస్యలతో సతమతమవుతూ ఉంటారని అన్నారు.

డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ యాజమాన్యం చేసే నిర్ణయాల్లో ప్రభుత్వ ఆదేశానుసారం జెన్కో యాజమాన్యం ఆదేశాల ప్రకారం తప్ప ఏ ఒక్క నిర్ణయం వ్యక్తిగతంగా తీసుకునే అవకాశం ఉండదని తెలిపారు. ఈ సంస్థలో బూడిద విషయంలో గాని, మరి ఏ ఇతర విషయంలోనైనా తీసుకునే నిర్ణయాలు స్థానిక డాక్టర్ ఎన్.టి. టి.పి.ఎస్ యాజమాన్యం పరిధిలో ఉండవని, విద్యుత్ సౌధ లోని ఏపీ జెన్కో మేనేజ్మెంట్ ద్వారానే జరుగుతాయని అందరూ గమనించాలని కోరారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ స్థానికులకు కావలసిన వైద్య సదుపాయాలు మందులు పంపిణీ చేయటంలో యాజమాన్యం ముందు ఉంటుందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, ఇతర సామాజిక కార్యకర్తలు, పత్రికా ప్రముఖులు గమనించి ప్రభుత్వ సంస్థలపైన దుష్ప్రచారం చేయక, సంస్థ పురోగతికి, తద్వారా ప్రాంత అభివృద్ధికి సహకరించాలని ఉద్యోగ సంఘాలు కోరాయి.

నాట్య ప్రదర్శనలో నాగార్జున విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దేవాదాయ ధర్మదాయ శాఖ శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున దేవస్థానంలో నిర్వహించిన 'ధర్మపదం'లో అద్భుతమైన నాట్యప్రదర్శన చేసి ప్రశం పత్రాలను పట్టణంలోని నాగార్జున హైస్కూల్ చిన్నారులు ఆర్.భవ్యశ్రీ (8వ తరగతి), టి.అలకనంద (ఆరో తరగతి) అందుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులను స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా 'ఇండియా ఎనర్జీ వీక్'

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వివిధ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ఇతర ఇంధన సామర్థ్యాల పరిశ్రమల సవాళ్లు, పనితీరు అంచనాలు వృద్ధి కోసం నిర్వహించిన ఇండియా ఎనర్జీ వీక్ కార్యక్రమం ఘనంగా జరిగిందని ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ సంస్థ డైరెక్టర్ విశాల్ కపూర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థిరమైన ఇంధన పరివర్తనపై తన నిబద్ధతను బలోపేతం చేసేందుకు గానూ ఐఎంటి జిటి జెఎసి, గ్రీన్ గోత్ ఫౌండేషన్, ఐఐటి హైదరాబాద్ తదితర సంస్థలతో ఈఈఎస్ఎల్ ఎంవోయూ చేసుకుందన్నారు. వినూత్న ఇంధన సామర్థ్య పరిష్కారాలు సహకార వృద్ధికి ఈ కార్యక్రమం ఉపయోగపడిందన్నారు. హార్టికల్చర్ విభాగం కింద నర్సరీ మేనేజ్‌మెంట్ సొసైటీతో సౌర విద్యుత్ మైక్రో కోల్డ్ స్టోరేజ్ సొల్యూషన్ సేవలు అందజేస్తామన్నారు. శక్తి సమర్థవంతమైన లైటింగ్, క్లీన్ వంట పరిష్కారాలు, అంతరిక్ష తాపన, పునరుత్పాదక శక్తి, విద్యుత్ చైతన్యం, శీతలీకరణ సాంకేతికతలు కన్సల్టెన్సీ సేవలు వంటి క్లిష్టమైన ప్రాంతాలను అభివృద్ధి చేయడంపై ఇఇఎస్ఎల్ దృష్టి పెడుతుందన్నారు. ఈ భాగస్వామ్యాలు రైతులకు స్థిరమైన శక్తి–సమర్థవంతమైన నిల్వ పరిష్కారాలను అందించడం, పంటకోత అనంతర నష్టాలను తగ్గించడంలో సహాయపడటం, వ్యవసాయ గేట్ వద్ద ఉత్పత్తి నుండి ఉద్గారాలను తగ్గించడం లాంటి పరిష్కారాలతో రూపొందించబడుతుందని చెప్పారు.

వరకట్న వేధింపులపై కేసు

ప్రజాశక్తి - వత్సవాయి :

వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అర్జున్ తెలిపారు. ముచ్చింతల గ్రామానికి చెందిన లావణ్యతో తెలంగాణ రాష్ట్రం, భద్రాది కొత్తగూడెం జిల్లా మణుగూరు గ్రామానికి చెందిన ఎం.అవినాష్‌తో 2022 సంవత్సరంలో వివాహం అయింది. వివాహ సమయంలో కట్న కానుకలు ఇచ్చారు. గత కొంతకాలంగా అదనపు కట్నం తీసుకురావాలని లావణ్యను భర్త అత్తమామలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆమె తెలిపింది. కొంతకాలంగా ముచ్చింతల గ్రామంలో తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త అవినాష్‌పై, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అర్జున్ తెలిపారు.